వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 301 సేవలు అభినందనీయం : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ రవిచారి

రాంనగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాల్లో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 301 అందిస్తున్న సేవలు అభినందనీయం అని కేం ద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని వాకర్స్ ఇం టర్నేషనల్ డిస్ట్రిక్ట్ 301 సదస్సు, అవార్డుల ప్రదానం జరిగింది. డిస్ట్రిక్ట్ గవర్నర్ లిం గప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి, కార్పొరేటర్ కె.రవిచారి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషన ల్ క్లబ్‌లు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి ఇతరులకు మార్గదర్శకం కావాలన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో పార్కులో వాకర్స్‌కు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ సంస్థకు నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మనోహర్‌రెడ్డిని కేంద్రమంత్రి సత్కరించి క్లబ్ కార్యక్రమాలను విస్తరింపచేయాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆర్.వివేక్, క్లబ్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, కె.రమణధామ్, ప్రతినిధులు చక్రపాణి, డాక్టర్ బి.గంగాధర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లను 52శాతానికి పెంచాలి'

బర్కత్‌పుర, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను 52శాతానికి పెంచి రాజ్యాంగ భద్రత కల్పించాలని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కన్వీనర్ టి.నందగోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం బర్కత్‌పురలోని నివాసంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. 42శాతం బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని, 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధతకై రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. ఇటీవల బీసీ రిజర్వేషన్ల కోసం ఆత్మబలిదానం చేసుకున్న సాయిఈశ్వరాచారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లి నాగేశ్వరరావు, ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లకుంట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా సం క్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కార్పొరేటర్ యాకర అమృత పేర్కొన్నారు. ఆదివారం డివిజన్‌లోని నర్సింహబస్తీ కమ్యూనిటీహాల్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హక్ దర్శక ఈ శ్రమ 2 లక్షల ఇన్సూరెన్స్ కార్డు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రధాని మోదీ అన్నివర్గాల సంక్షేమం కోసం యోజన, ఈశ్రమ, ఎస్ఎఫ్‌డీపీ వంటి కార్డులతో కూడిన పథకాలను ప్రవేశపెట్టారని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకాలలో ఆధార్ కార్డు, చిరునామాలను అప్‌డేట్ చేసుకోవాలని, నూతన ప్యాన్‌కార్డు, ఉదయం రిజిస్ట్రేషన్ వంటి పీఎంఎస్‌బీవై వర్తింపచేస్తుందన్నారు. ఈ విషయంపై ఇతరత్ర అంశాలపై సంబంధిత అధికారులను ప్రజలు సంప్రదించి తగు సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు ఎం.భూపతినాథ్, ఇ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మను మించిన దైవం లేదు'

చిక్కడపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అమ్మను మించిన దైవం లేదని ప్రముఖ న్యాయవాది బర్మ ఇందిర అన్నారు. కాసుల అనసూయ వెంకటేశం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో రోల్ ఆఫ్ మదర్ ఇన్ వన్స్ లైఫ్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వెలకట్టలేని ప్రేమకు నిలువెత్తు రూపం అమ్మ అన్నారు. అనునిత్యం మాతృమూర్తిని పూజనీయులుగా భావించాలనే సంస్కారం మనది అన్నారు. భవాని, లక్ష్మాంజలి, రూపా, పద్మప్రియ, విజయభారతి, రమ తదితర మాతృమూర్తులను సత్కరించి అభినందించారు. డా. అఖిల్‌కుమార్‌ఝా, న్యాయవాది కొమ్మిరెడ్డి కరమ్, డా. సూర్యప్రకాష్, ట్రస్ట్ చైర్మన్ కాసుల మల్లికార్జున్, సీనియర్ ట్రస్టీ నర్రా దేవేందర్, సీనియర్ అడ్వకేట్ కాసుల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పద్యనాటక ప్రదర్శనలు

చిక్కడపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పురాకృతి రంగస్థల కళావేదిక 11వ వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం ప్రదర్శితమైన పద్యనాటక ప్రదర్శనలు ఆకట్టుకునేలా జరిగాయి. ప్రముఖ రంగస్థల నటులు పుట్రేవు రాధాకృష్ణమూర్తి 94వ జయంతి వేడుకల సందర్భంగా త్యాగరాయగానసభలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ప్రదర్శనలు నిర్వహించారు. తొలుత భూకైలాస్, తర్వాత భక్తప్రహ్లాద ప్రదర్శనలలో పలువురు నటీనటులు వివిధ పాత్రలు పోషించి రాగాలాపనతో, తమ నటనతో ప్రదర్శనలను రక్తి కట్టించారు. తొలుత కార్యక్రమాలను పుట్రేవు నాగేశ్వరరావు, నీలకంఠేశ్వరరావు, టి. భానుకల్యాణ్, మూర్తి, సీఎస్ రెడ్డి, డీఎస్ ప్రసాద్ ప్రారంభించగా సాయంత్రం జరిగిన నటీనటుల అభినందన సభలో కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డీఎస్ఎన్ మూర్తి హాజరయ్యారు. నటులు మల్లాది వెంకటరమణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సాయిఈశ్వరాచారి ఆత్మహత్య బాధాకరం : వల్లభనేని

రాంనగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : బీసీ ఉద్యమ నాయకుడు సాయి ఈశ్వరాచారి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని డీఎస్‌డీ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కోకన్వీనర్ కటమోని వెంకటేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రూ. 25లక్షల నష్టపరిహారంతో పాటు ఆ కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం అందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు. ఇలాంటి ఆత్మహత్య సంఘటనలు జరకుండా చర్యలు చేపట్టాలని కోరారు.


కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వకర్మ సంఘం నాయకులు

కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ

గోల్నాక, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల కోసం సాయిఈశ్వరాచారి ప్రాణత్యాగం చేసుకున్న ఘటనపై అంబర్‌పేట నియోజకవర్గ విశ్వకర్మ సంఘం నాయకులు జ్యోతిబాపూలే చౌరస్తా నుంచి అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం శ్రీకాంతాచారి చౌరస్తా వరకు కొవ్వొత్తులతో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గొట్టాల వినోద్‌చారి, ఈ.వేణుగోపాల్‌చారి, యు.కృష్ణమాచారి, ఎస్.భాస్కర్‌చారి, పడకంటి అంజయ్యచారి, ఎస్.సంజీవచారి, శ్రీహరిచారి, సంపత్‌చారి, బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కే.పీ మురళీకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఈదమ్మ పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా రాజు



ముషీరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : భోలక్‌పూర్ డివిజన్ ఇంద్రనగర్‌లో ప్రసిద్ధిగాంచిన ఈదమ్మ పోచమ్మ ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా రాజు నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని శాంతి భారత్ సేవా సమాజ్ అధ్యక్షుడు నందగిరి నరసింహ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి బాధ్యతగా పనిచేస్తానన్నారు. ఉత్సవాలను, పూజలను నిత్యం నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందిస్తామన్నారు.

ఓట్ల చోరీ వల్ల ప్రజాస్వామ్యం ఖూనీ : మసూద్

ముషీరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : దేశంలో ఓట్ల చోరీ వల్ల ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్ అన్నారు. ఆదివారం పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఓట్ల చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ గెలవడానికి ఓట్ల చోరీకి పాల్పడుతుందని ఆరోపించారు. భోలక్‌పూర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు జహీరుద్దీన్, నాయకులు అల్లావుద్దీన్, అక్బర్‌అలీ, రహీం, వాజీద్ పాల్గొన్నారు.

విప్లవోద్యమాన్ని కాపాడుకోవాలి

● విప్లవోద్యమ మేధావుల పిలుపు


మాట్లాడుతున్న విప్లవోద్యమ మేధావి, రచయిత అజిత్ తదితరులు

రాంనగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విప్లవం మన శ్వాస, మన ధ్యాస రండి కలబోసుకుందాం అని పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు. విప్లవోద్యమ పంథా ప్రజాదరణలోకి, అనుభవంలోకి ఎలా వచ్చిందో చర్చించుకోవడంతో పాటు చిక్కుకుపోయిన విప్లవోద్యమాన్ని కాపాడుకోవడానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో భారత ప్రజా యుద్ధం - సమకాలీన సందర్భం అనే అంశంపై సదస్సు వేదిక అధ్యక్షుడు ఎం.సాంబమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పుస్తకావిష్కరణ, అమరులు మీడ్కో తండ్రి సోమయ్య పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కేరళ రాష్ట్రానికి చెందిన రచయిత, విప్లవోద్యమ మేధావి అజిత్ మాట్లాడుతూ నక్సల్బరీ పోరాటం జరిగినప్పుడు ఎదుర్కొన్న సంక్షోభం పట్ల కామ్రేడ్ చారుమజుందార్ ఒక వ్యాసాన్ని రాశారని గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా అటువంటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామన్నారు. ఆ సమయంలో కాంగ్రెస్ ఎన్నుకోబడిన కేంద్ర కమిటీ సభ్యుల్లో సాయుధ పోరాటానికి కట్టుబడి ఉన్న వారిని కేంద్ర ప్రభుత్వం చంపేసిందన్నారు. సాయుధ పోరాట పంథాకు దోహదం తలపెట్టిన వారందరినీ ప్రభుత్వం వదిలేసిందని ఆరోపించారు. విప్లవం గురించి మాట్లాడే వారు ముందుగా అర్థం చేసుకోవాలన్నారు. భారత విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి రాజ్యం మొండిగా దాడికి తెగబడుతుందని, వీటిని తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా భారత సమాజం, ఉత్పత్తి సంబంధాల అంశంపై యాకయ్య జయ అధ్యక్షతన జరిగిన సభలో వై.రాజశేఖర్, ఎన్.వేణుగోపాల్, దేశ ప్రజలపై కగార్ దాడి అంశంపై పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, దీర్ఘకాలిక సాయుధ పోరాట పంథా అంశంపై మహమ్మద్ హుస్సేన్, ఎన్.రవి, ఫాసిస్ట్ సందర్భంలో విప్లవోద్యమం అంశంపై ప్రవీణ్‌కుమార్, నవజ్యోతి, బిజిగిరి శ్రీనివాస్, ఝాన్సీ, భరద్వాజ్ ప్రసంగించారు.

బాలకార్మికుడిని తీసుకువెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న రైల్వే పోలీసులు

బర్కత్‌పుర, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : బాలకార్మికుడిని పనిలో పెట్టడానికి తీసుకెళ్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు కాచిగూడ రైల్వే పీ ఎస్ సీఐ ఎల్లప్ప తెలిపారు. ఆదివారం సీడబ్ల్యూసీ, రైల్వే పోలీసులు సంయుక్తంగా కర్నాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన మైనర్ బాలుడిని అదే రాష్ట్రానికి చెందిన నరీమ్(32) అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బాలుడిని చైల్డ్ హోమ్‌కు తరలించి నరీమ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

10న కవి సమ్మేళనం

చిక్కడపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కామన్ డయాస్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉదయం 10 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు కనకాచారి తెలిపారు. గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ కోదాటి నారాయణరావు 112వ జయంతిని పురస్కరించుకుని చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనే ఆసక్తి కలవారు 8790874028 నెంబర్‌లో సంప్రదించాలని సమ్మేళనం పాల్గొన్న వారికి నీ స్నేహం కోసం కథం పుస్తకం అందజేయబడుతుందన్నారు.

అల్పాహారం, పండ్ల పంపిణీ

రాంనగర్ : కందూరి కృష్ణ ఫౌండేషన్, సేఠ్ మాణిక్ లాల్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలో పేదలకు అల్పాహారం, పండ్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని కందూరి కృష్ణ ప్రారంభించారు. ప్రమోద్ అగర్వాల్, గోవిందరావు, కౌశిక్, డాక్టర్ సంగీత, మౌనిక పాల్గొన్నారు.

కవిత్వం సాహిత్య కళారూపకం : నర్సింగ్‌రావు


ఏకాంతం ఒక అతిథి కవిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏలే లక్ష్మణ్, బి.నర్సింగ్‌రావు

బర్కత్‌పుర, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆనాడు నాటకం కళారూపకంగా నిలబడగా నేడు కవిత్వం సాహిత్య కళారూపకంగా నిలబడుతుందని ప్రముఖ సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు అన్నారు. సాహిత్యంలో కవిత్వం భాగమైనప్పుడు నిగూఢత లేకపోతే అది నిలబడలేదన్నారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పసునూరు శ్రీధర్‌బాబు రచించిన ఏకాంతం ఒక అతిథి కవిత పుస్తకాన్ని ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి.నర్సింగ్‌రావు మాట్లాడుతూ, కవిత్వం ఒక వ్యసనం వంటిదని, అందులో దిగిన వారు బయటకు రావడం కష్టమన్నారు. కళాత్మకమైన విలువలు తెలిసిన కవి శ్రీధర్‌బాబు అని కొనియాడారు. తెలుగులో కవిత్వం రాసేవారు చాలా మంది ఉన్నారని, వారు బయటి ప్రపంచాన్ని పట్టించుకోరని అన్నారు. తెలంగాణ అస్తిత్వ దోరణిలో వస్తున్న కవితలో శ్రీధర్‌బాబుది డిఫరెంట్ దోరణి అని భిన్నమైన శైలిలో కవిత్వాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రముఖ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్ మాట్లాడుతూ, అద్భుతమైన కవిత్వాన్ని సమాజానికి అందించారని అన్నారు. ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ, న్యాయవాదిగా కొనసాగడం ఇష్టం లేక రచనలపై ఆసక్తితో జర్నలిజంలోకి శ్రీధర్‌బాబు అడుగుపెట్టారని అన్నారు. కార్యక్రమంలో రచయిత్రి విమల, రచయిత సిద్ధార్థ, కవి ప్రసాదమూర్తి, పసునూరు శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 137ను రద్దు చేయాలి

● తెలంగాణ లెదర్ ఆర్టిజన్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి


నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ లెదర్ ఆర్టిజన్స్ కోఆపరేటివ్ సొసైటీ నేతలు

కవాడిగూడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 137ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ లెదర్ ఆర్టిజన్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి, కార్యదర్శి ములుగు రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ లెదర్ ఇండస్ట్రీ ప్రమోషన్ ఆఫ్ కార్పొరేషన్‌లో గల 43ఎకరాల భూముల్లో 3.21 ఎకరాలను పెట్రోల్ బంకులకు 33 సంవత్సరాల పాటు లీజుకు ఇస్తున్నామని జీవో నెంబరు 137ను ప్రభుత్వం తీసుకువచ్చిందని ఈ జీవో వల్ల మాదిగ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జీవో నెంబర్ 137ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5.16 ఎకరాలలో యూనిట్ మాల్, యాభై అంతస్తులలో వాణిజ్య సముదాయాలకు మాల్ నిర్మించబోతున్నామని ప్రభుత్వం ప్రకటించిందని ఈ మాల్‌లో లెదర్ ఉత్పత్తుల కోసం వాణిజ్య సముదాయాన్ని కేటాయిస్తామని ఎక్కడా పేర్కొనలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్పొరేట్ వాణిజ్య సముదాయాల ఏర్పాటును వెంటనే నిలిపివేయాలి లేదా మాకు అందులో యాభై శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత లిడ్‌క్యాప్‌ను తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ ఆఫ్ కార్పొరేషన్‌గా పునరుద్ధరించాలని చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రవీందర్, మోగిలి, కొండయ్య, రాంబాబు, ఓంప్రకాష్, రమేష్, జాన్ సతీష్, రాజు, శ్యాం పాల్గొన్నారు.


తెలంగాణ బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలుగా గంగాపురం పద్మగంగాపురం పద్మకు నియామక్ష పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

మహిళా బిల్లులో బీసీలకు సబ్ కోటా విధించాలి: ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా విధించాలని, జనాభా దామాషా ప్రకారం మహిళా రిజర్వేషన్లను 33 శాతం నుంచి 50 శాతం పెంచాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం తెలంగాణ బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలుగా గంగాపురం పద్మను నియమించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ మహిళా బిల్లును విస్తరింప చేస్తే కేంద్ర ప్రభుత్వంలో 54 లక్షల ఉద్యోగాల్లో 27 లక్షలు, 29 రాష్ట్రాల్లోని కోటి ఎనభై లక్షల ఉద్యోగాల్లో 90 లక్షలు మహిళలకు దక్కుతాయని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కో- ఆర్డినేటర్ ర్యాగ అరుణ్‌కుమార్, నాయకులు సి.రాజేందర్, పగిల్ల సతీష్, రాజ్‌కుమార్, అనురాధగౌడ్, దివ్య, దీప, పద్మ, వసంతమ్మ, జ్యోతి, అపర్ణ, రాజకుమారి, లక్ష్మీసౌజన్య పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గోపాల్

సేవాభావాన్ని అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే

ముషీరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని పఠాన్‌బస్తీలో ప్రముఖ విద్యావేత్త సయ్యద్ అన్వర్ ఉల్లా ప్రథమ వర్థంతి సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి, టెంట్‌హౌస్ శ్రీనివాస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్మారకసభ, అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యామండలి పరిధిలో మొట్టమొదటి స్కూల్‌లో స్థాపించి 62ఏళ్లుగా పేద విద్యార్థులకు విద్యనందించిన గొప్ప మేధావి సయ్యద్ అన్వర్ ఉల్లా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్, భిక్షపతియాదవ్, నాయకులు పాల్గొన్నారు.

దారి దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

కవాడిగూడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్‌లో జరిగిన దారిదోపిడీ కేసును దోమలగూడ పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. దోమలగూడ సీఐ మహమ్మద్ అంజద్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం.. బోద్దులూరి వెంకటేశ్వరరావు అశోక్‌నగర్ యూనియన్ బ్యాంకులో రూ. 2లక్షల 50వేలు డ్రా చేసుకుని వెళ్తుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి చేతిలోని బ్యాగు లాక్కోని పారిపోయాడు. అందిన ఫిర్యాదు మేరకు నేరం జరిగిన ప్రాంతంలోని పలు సీసీ కెమెరాలు పరిశీలించగా జ్యోతినగర్ మార్కెట్ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలో నిందితుడు తన వాహనం నెంబర్ ప్లేట్‌తో పాటు దుస్తులు మార్చుకోవడాన్ని పోలీసులు గుర్తించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా లోయర్ చెందిన రాపిడో రైడర్ కే తరుణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి 2లక్షల 29 వేల రూపాయల నగదును యాక్టివా వాహనం, సెల్ ఫోన్‌తో పాటు నకిలీ నెంబర్ ప్లేట్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలం


మహాధర్నాకు ర్యాలీగా తరలివెళ్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ నేతలు

కవాడిగూడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి పూర్తిగా విఫలం చెందిందని స్థానిక కార్పొరేటర్ జి. రచనశ్రీ ఆరోపించారు. ఇందిరాపార్కు వద్ద బీజేపీ చేపట్టిన మహాధర్నాకు ఆదివారం దోమలగూడ నుంచి కార్పొరేటర్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ ర్యాలీలో పార్టీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, నగరనాయకుడు ఎంసీ మహేందర్‌బాబు, డివిజన్ ప్రధాన కార్యదర్శులు కేశవరాజు, బొల్ల రమేష్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు ఎ ప్రభాకర్ గంగపుత్ర, డి శ్రీనివాస్ ముదిరాజ్, శివరాజ్, నగర నాయకులు కుమార్‌గౌడ్, సుదర్శన్, వాసు పాల్గొన్నారు.

చిక్కడపల్లి : తెలంగాణాలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు వి. నవీన్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను మోసగిస్తోందని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కువద్ద జరిగిన ధర్నాకు గాంధీనగర్ డివిజన్ నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లారు. జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ వద్ద నుంచి ర్యాలీగా ధర్నాచౌక్‌కు బయలుదేరిన సందర్భంగా ర్యాలీని నవీన్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆనంద్‌రావు, వీఎస్టీ రాజు, సంయుక్త రాణి పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

● తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు


మాట్లాడుతున్న పోచంపల్లి రమణారావు తదితరులు

నల్లకుంట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బ్రాహ్మణుల సమస్యల శాశ్వత పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తున్నామని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఆదివారం నల్లకుంటలోని సంఘ సమాఖ్య కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రాహ్మణుల న్యాయమైన సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సమాఖ్య ఆధ్వర్యంలో ఉపనయనాలు వివిధ జిల్లాల్లో భాగంగా యాదాద్రి, భువనగిరిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్యలో నూతన సభ్యులను చేరుస్తూ సభ్యత్వాలు తీసుకుని కొన్ని జిల్లాల్లో లేని కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. బ్రాహ్మణులకు కుల ధ్రువీకరణ పత్రాలు క్యాంపు కార్యక్రమంలో ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, కోశాధికారి ఊరే ప్రసాదరావు, ఉప కోశాధికారి గూడ రాజేశ్వరరావు, ప్రచార కార్యదర్శి గూడ జయరాం, యాదాద్రి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకవరం రమేష్, దానం రామేశ్వరరావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంప రామారావుశర్మ, దేవులపల్లి బాలచంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణ పేరుతో అవినీతి

● అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం ఆరోపణ
● విచారణ జరిపించాలని డిమాండ్


మాట్లాడుతున్న శ్రీనివాస్, వీరయ్య

రాంనగర్ : జీహెచ్ఎంసీ పరిధిలో వీధి కుక్కల నియంత్రణ పేరుతో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని, వెటర్నరీ విభాగంపై జంతు ప్రేమికుల సంఘాల ఆధిపత్యాన్ని నివారించాలని హైదరాబాద్ సిటిజన్ ఫోరం, అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం డిమాండ్ చేశాయి. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన సమావేశంలో అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ ఎం.శ్రీనివాస్, హైదరాబాద్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య మాట్లాడారు. గ్రేటర్ పరిధిలో వీధి కుక్కల దాడిలో ఈ వారంలో ఇద్దరు బాలురు తీవ్రంగా గాయాలపాలయ్యారని అన్నారు. ప్రతి నిత్యం ఇలాంటి ఘటనలు నగరంలో అనేకం జరుగుతున్నా సరైన నివారణ చర్యలు లేవన్నారు. సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించిన కూడా గ్రేటర్‌లో వీధి కుక్కల నివారణలో అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీధి కుక్కల నిర్వహణ కోసం జంతు ప్రేమికుల సంఘాలకు, కాంట్రాక్ట్ ఏజెన్సీలకు అప్పగించిందని ఆరోపించారు. అధికారులు, కాంట్రాక్ట్ ఏజెన్సీలు కుమ్మక్కై నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. 2023, 24 లెక్కల ప్రకారం చార్మినార్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్‌లో వీధి కుక్కల సంఖ్య, వాటికి వ్యాక్సినేషన్, పర్చేస్ నిధుల విషయంలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. ఈ లెక్కలపై సమగ్ర విచారణ జరిపించి అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

ప్రపంచంలోనే అతిపెద్ద స్కామ్ హిల్ట్ పాలసీ

● మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

రాంనగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): భారత దేశ చరిత్రలోనే కాదు ప్రపంచంలోనే అతిపెద్ద స్కామ్ హైదరాబాద్ పారిశ్రామిక భూముల మార్పు(హిల్ట్) పాలసీ పేరుతో జరుగుతుందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిల్ట్ - పి ఎవరికోసం? ఎందు కోసం? పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం ఓ.నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఇష్టం వచ్చినట్లు తమకు నచ్చిన వారికి కట్టబెడుతున్నారని ఆరోపించారు. రూ.5లక్షల కోట్ల ప్రజల ఆస్తిని 440మంది పంచుకోవాలని చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగస్వాములైన వారిని ఎవ్వరినీ వదలమన్నారు. న్యాయపోరాటం చేస్తామని, భూములను కాపాడతామన్నారు. భూదోపిడీకి పాల్పడే వారిని తాము వచ్చాక జైలు కు పంపుతామని, ప్రజా అవసరాల కోసమే ఇండస్ట్రియల్ భూములు వినియోగించాలని ఆయన అన్నారు. హైదరాబాద్ ప్రజలనే కాదు, తెలంగాణ ప్రజలను మోసం చేయడానికే ఈ హిల్ట్ పాలసీ అని ఆయన ఆరోపించారు. పారిశ్రామిక భూములను ఒక పథకం ప్రకారం తక్కువ ధరకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీలో పెద్ద కుట్ర కోణం ఉందని అన్నారు. 40ఏళ్ల క్రితం ప్రభుత్వం నాచారం ఇండస్ట్రియల్ ఏరియాను 700 ఎకరాలతో నిర్మించిందన్నారు. అయితే పొల్యూషన్ చేసే కంపెనీలను తరలించాలనే సాకుతో ప్రభుత్వం పొల్యూషన్ చేయని కంపెనీలను కూడా తరలించాలని చూస్తుందని ఆరోపించారు. దోపిడీ దొంగల్లా భూ ముల కోసం హిల్ట్ పాలసీ అమలు చేయాలని చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీ ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ(ఎం) న్యూడెమోక్రసీ నేత కె.గోవర్ధన్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని ప్రైవేట్ ఉద్యోగి మృతి

బర్కత్‌పుర, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని ప్రైవేట్ ఉద్యోగి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్‌లో నివాసం ఉంటున్న ప్రవీణ్(23) ప్రైవేట్ ఉద్యోగి. ఆదివారం శంషాబాద్ - జూకల్ రైల్వేస్టేషన్ల నడుమ పట్టాలపై నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.